ప్రజాశక్తి

శనివారం 1 నవంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

అప్పన్నా తనామనా..

గూగుల్‌కు భూ పందేరమన్నా !



పంచ గ్రామాల రైతుల సాగులో ఉన్న భూమి (ఫైల్ ఫొటో)

- ఐటి కంపెనీల పేరిట అదానికి సాగిలపడుతోన్న ప్రభుత్వం
- 150 ఎకరాలు సిద్ధం
- పంచగ్రామాల రైతులకిచ్చిన హామీని మరచిన చంద్రబాబు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సింహాద్రి అప్పన్న భూములపై చంద్రబాబు ప్రభుత్వం కళ్లు పడ్డాయి. కార్పొరేట్లకు వాటిని అప్పగించేందుకు సకల ప్రయత్నాలూ చేస్తోంది. 'అప్పన్నా.. తనామనా అందరికీ దండాలన్నా' అంటూ గతంలో వయోలియన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామినాయుడు తన ఫిడేలుపై హృద్యంగా వాయించేవారంటూ ఒకనానుడి. ఆ పాటను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 'అప్పన్నా తనామనా అదానీ, గూగుల్ వారికి భూములన్నా' అంటూ కొత్త గళం ఎత్తుకోవడం అంతటా చర్చనీయాంశమైంది. విశాఖలో భూపందేరం నడుస్తోంది. ఐటి కంపెనీల పేరుతో భూముల అప్పగింతకు కూటమి సర్కారు తెగబడుతోంది. ఇప్పటివరకూ రుషికొండ, మధురవాడ, కాపులుప్పాడ ప్రాంతాల్లో భూములను పలు సంస్థలకు కట్టబెట్టి తాజాగా పంచగ్రామాల రైతుల భూములపై కన్ను వేసింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పింది. పైపెచ్చు ఆ భూములను ఒక్కొక్కటిగా లాక్కొనే ప్రయత్నాలు ఆరంభించింది.

అడవివరం అడ్డాగా భూ పందేరం

అడవివరం సర్వే నెంబరు 275లో 150 ఎకరాలను ప్రభుత్వం తీసుకుంది. ఇదంతా గూగుల్, అదాని కోసమే. అక్కడ ప్రభుత్వ మార్కెట్ విలువ చదరపు గజం రూ.17 వేలు లెక్కన చూపించి ఆ భూముల విలువ రూ.1234.20 కోట్లుగా పేర్కొంది గతంలో అంటే 2006లో కొత్త సెంట్రల్ జైలు నిర్మాణం కోసం అదే అడవివరంలో 100 ఎకరాలను ప్రభుత్వం తీసుకుంది. దానికి ప్రత్యామ్నాయంగా మధురవాడలోని సర్వే నెంబర్లు 420, 424లలో 106.47 ఎకరాలు ఇచ్చింది. వాటిని కూడా ఇప్పుడు ఐటి కంపెనీలకు అవసరమని చెప్పి గత నెలలో వెనక్కి తీసుకుంది. అక్కడ చదరపు గజం రేటు రూ.44 వేలుగా ఉందని చెప్పి వాటి విలువ రూ.2267.38 కోట్లుగా చూపించింది. అడవివరంలో తాజాగా 150 ఎకరాలు, మధురవాడలో మిగతా 2లో..

శారద గండితో 400 ఎకరాల్లో పంటనష్టం

- గట్టు పునర్నిర్మాణానికి రూ.2.50 కోట్లతో చర్యలు
- హోం మంత్రి అనిత



గండి పూడ్చివేత వివరాలు తెలుసుకుంటున్న మంత్రి అనిత

ప్రజాశక్తి - అనకాపల్లి/రాంబిల్లి : శారద నదికి గండి పడటంతో రాంబిల్లి మండలంలో సుమారు 400 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్టు రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రాంబిల్లి మండలం రజాల అగ్రహారం వద్ద శారదా నదికి గండి పడిన ప్రాంతాన్ని శుక్రవారం అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయకుమార్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొంథా తుపాను కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టమూ జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్న జిల్లా యంత్రాగానికి, కలెక్టర్ విజయకృష్ణన్‌కు అభినందనలు తెలిపారు. శారదానది గట్టుకు ఆనుకుని ఉన్న జనావాస ప్రాంతాలలో ఎటువంటి గండ్లు పడకుండా జిల్లా యంత్రాగం కృషి చేసినప్పటికీ విపత్కర పరిస్థితులలో రాంబిల్లి మండలం రజాల అగ్రహారం వద్ద శారదానదికి గండి పడిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అక్కడ తాత్కాలికంగా గండి పూడ్చివేత పనులు చేపడుతున్నారన్నారు. సుమారు 35 వేల ఇసుక బస్తాలు సిద్ధం చేశారన్నారు. శాశ్వత పరిష్కారానికి రూ.2.50 కోట్లతో నీటిపారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. జిల్లాలో 2000 హెక్టార్లలో పంటనష్టం, 100 హెక్టార్లతో ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని తెలిపారు. తుపాను సమయంలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులను సక్రమంగా నిర్వహించిన రెవెన్యూ, పోలీసు, ఫైర్, గ్రామీణ నీటిసరఫరా, ఇరిగేషన్, వైద్యశాఖ, విద్యుత్ శాఖ, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, పంచాయతీ, తదితర శాఖల సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

రైవాడ జలాశయం నీటి ఉధృతి పెరగడం వల్లే..

మొంథా తుపాను కారణంగా కురిసిన వర్షాలకు రైవాడ జలాశయం నుంచి అత్యధికంగా 14 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మిగతా 2లో..

బీచ్ రోడ్డులో మాయా వరల్డ్ ప్రారంభం

వార్త 2లో..

మారిటైమ్ వీక్‌లో హెచ్‌ఎస్‌ఎల్ కీలక ఒప్పందాలు

వార్త 2లో..

శిథిలమైన రోడ్లను వెంటనే పునర్నిర్మించాలి

వార్త 6లో..

స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలి



దీక్షా శిబిరంలో నినదిస్తున్న ఐద్వా కార్యకర్తలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, సొంత గనులు కేటాయించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో తొలగించిన ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1677వ రోజుకు చేరాయి. ఐద్వా కార్యకర్తలు దీక్షల్లో కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ అనేక పోరాటాలు, త్యాగాలు ఫలితంగా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైన విషయాన్ని గుర్తుచేశారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కర్మాగారం ఎంతో కీలకపాత్ర పోషించిందని తెలిపారు. అటువంటి కర్మాగారాన్ని అమ్మేసేందుకు మోడీ సర్కారు పూనుకోవడం దుర్మార్గమన్నారు.

ఉక్కును రక్షిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మాట తప్పిందన్నారు. పోరాటాలతో కర్మాగారాన్ని రక్షించుకుంటామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు ఆర్.వరలక్ష్మి, జి.లక్ష్మి, ఆర్.విమల, కె.కుమారి, కె.మణి, జి.మణి, మమత, బి.సత్యవతి, డి.శైలజ, భవాని, సరోజిని పాల్గొన్నారు.



పుస్తక మహోత్సవానికి భారీగా తరలొచ్చిన విద్యార్థులు



స్టాల్ వద్ద పుస్తకాన్ని ఆసక్తిగా చూస్తున్న బుడతడు

ఘనంగా అనకాపల్లి పుస్తక మహోత్సవం ప్రారంభం

అనకాపల్లి వేదికగా తొలి పుస్తకాల పండగ మొదలైంది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్‌ల ఆధ్వర్యాన స్థానిక ఎన్‌టిఆర్ గ్రౌండ్, అల్లూరి సీతారామరాజు ప్రాంగణంలో అనకాపల్లి పుస్తక మహోత్సవం పేరిట తలపెట్టిన ఈ కార్యక్రమానికి తొలి రోజు విశేష స్పందన దక్కింది.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)



థింసా నృత్యంతో అలరించిన యువకులు

మొదటి పేజీ తరువాయి..

అప్పన్నా తనామనా..
గూగుల్‌కు భూ పందేరమన్నా !

106.47 ఎకరాలు మొత్తంగా 256.47 ఎకరాలు కాగా వాటి విలువ రూ.3501.58 కోట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఐటి హిల్స్ రుషికొండపై సుమారు 10 కంపెనీలకు ఇప్పటికే వందల ఎకరాలను 'కూటమి' ఇచ్చేసింది. ఆనందపురం మండలం తర్లువాడలో 400 ఎకరాల దళితుల సాగుభూమిని గూగుల్ డేటా సెంటర్‌కు సిద్ధం చేయడమేగాక ప్రస్తుతం పంచగ్రామాల భూములపై పడింది.

2008 సర్వే బోగస్ ?

2008 సర్వే లెక్కలు ఒక పెద్ద బోగస్ అని తెలుస్తోంది. ఈ సర్వే ఏం చెబుతుందంటే.. 12149 మంది ఆక్రమించిన దేవస్థానం భూమి విస్తీర్ణం 420 ఎకరాలు అంటూ దేవస్థానం అధికారుల చేత ప్రభుత్వం చెప్పించింది మినహా నిజానికి రైతుల ఆక్రమణ అంటూ పంచగ్రామాల్లో ఏమీ లేదు. 1903 గిల్‌మెన్ (అధికారిక) సర్వే ప్రకారం సర్వే నెంబర్లతో సహా రైతుల పేర్లు (సాగుదార్లు)ను పేర్కొనడం జరిగింది. అన్ని హక్కులూ ఈ గ్రామాల్లో రైతులు, ప్రజల వద్ద ఉన్నాయని ఆర్‌డిఒ కోర్టు విచారణ 2002లో తేలినాక ఏప్రిల్ 3న 2010లో ఆర్‌డిఒ కోర్టు ఆర్డర్ 268/2002ను ఆధారం చేసుకుని అవి రైతులవి అని తేల్చారు. 1996-1997లో పెందుర్తి చినగదిలి తహశీల్దార్లు 9069 ఎకరాలకు పట్టాలు ఇచ్చారు. ఈ పట్టాలు సక్రమం కాదన్నది స్పష్టంగా ఆనాడే తేలిపోయినా ప్రభుత్వాలు పంచగ్రామాలకు న్యాయం చేయడానికి ససేమిరా అంటున్నాయి. 2008 సర్వే లెక్కల ప్రకారం 11282 ఎకరాల భూమిలో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారు 12149 మంది. ఈ భూమిపైనే పైన తెలిపిన తహశీల్దార్లు 9069 ఎకరాలకు పట్టాలు ఇచ్చేశారు. మిగిలిన 1785 ఎకరాల్లో 300 మంది రైతులు, పైన తెలిపిన 12149 మంది ఇళ్లు కట్టుకుని ఉన్నవారూ ఉన్నారు. వారికి న్యాయం చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఎగనామం పెడుతూ వస్తోంది.

2008 సర్వే ప్రకారమైనా ముందుకెళ్తుందా?


ప్రభుత్వం భావిస్తున్నట్టుగా 2008 సర్వే ప్రకారం 420 ఎకరాలను రైతులు ఆక్రమించుకున్నారని అనుకున్నా సరే.. దీనికి ప్రత్యామ్నాయంగా 547 ఎకరాలు ఇవ్వడానికి గత 2019-2024 మధ్య ప్రభుత్వంలోనే ప్రతిపాదన ఉంది.. దీనికి దేవస్థానం ఛైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజు అంగీకరించలేదు. ఆ తర్వాత గాజువాక, మల్కాపురం, గొల్లలపాలెం, పెదగంట్యాడల్లో ఈ భూమిని 'కూటమి' ప్రభుత్వం కొంచెంగా పెంచి మొత్తం 610.89 ఎకరాల కొండలను ఇవ్వడానికి ముందుకు వచ్చింది. ఇంకా దీనిపై 'రాజు'గారు ఉలుకూ పలుకూలేదు. వీటి విలువ రూ.5231 కోట్లు ఉంటుంది. ప్రస్తుతం ఐటి కోసమని అడవివరంలో 150 ఎకరాలు, మధురవాడలో 106.47 ఎకరాలు మొత్తంగా 256.47 ఎకరాలకు ప్రత్యామ్నాయంగా అదే పైన తెలిపిన కొండలపై 370.9 ఎకరాలను ప్రత్యామ్నాయంగా ఇచ్చేందుకు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

శారద గండితో 400 ఎకరాల్లో పంటనష్టం

శారదానది ప్రవాహం పెరిగి గట్టు తెగిపోయినట్టు జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. సుమారు 200 మీటర్లు గండిపడి పరిసర గ్రామంలోకి నీరు ప్రవేశించిందని, పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. పొలాలలో చిక్కుకున్న నలుగురిని కాపాడామన్నారు. ముంపునకు గురైన గ్రామాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి నిర్వాసితులకు వసతి ఏర్పాటుచేశామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సహాయం అందజేస్తామన్నారు.

మనసు ప్రశాంతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మనసు ప్రశాంతతే ఆధునిక జీవనశైలిలో దీర్ఘాయువు అని కంప్యూటర్ సైన్స్, గ్రాడ్యుయేట్ పరిశోధకుడు తన్వీర్ మొహమ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధునిక జీవనశైలిలో దీర్ఘాయువు, ఆరోగ్యకరమైన జీవితం ఎలా సాధ్యమవుతుందో డాక్టర్ జోనాథన్ పాబోలేట్ అనే పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం వెల్లడించిందని ఆయన తెలిపారు. ఎక్కువ కాలం, ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి జీవనశైలి, మనస్తత్వం, రోజువారీ క్రమశిక్షణే ప్రధాన కారణాలని పేర్కొన్నారు. జపాన్, ఇటలీ వంటి దేశాల్లో ప్రజలు 83-85 ఏళ్లు సులభంగా జీవిస్తుంటే భారతదేశంలో చాలా మంది 50-60 ఏళ్లకే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. దీనికి కారణం జన్యుపరమైన అంశాలు కాదని, మనం ప్రతిరోజూ గడిపే జీవనశైలి మాత్రమేనని పరిశోధకులు స్పష్టం చేశారన్నారు.



తన్వీర్ మొహమ్మద్

ఈ పరిశోధనలో భాగంగా ఒక వినూత్న ప్రయోగం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అందులో కొంతమందికి జంక్ ఫుడ్ ఇచ్చి, అది ఆరోగ్యకరమైన ఆహారమని నమ్మించారని, ఆశ్చర్యకరంగా ఆ ఆహారం ఆరోగ్యకరమైనదని నమ్మిన వారి రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉన్నాయని, దీని ద్వారా మనసు శరీర నియంత్రణపై ఎంత శక్తివంతమైన పాత్ర పోషిస్తుందో అర్థమవుతోందని తెలిపారు. దీర్ఘాయువు కోసం ముఖ్యంగా సాయంత్రం 6 గంటల కంటే ముందే రాత్రి భోజనం పూర్తి చేయాలన్నారు. భోజనం చేసిన తర్వాత కనీసం 15 నిమిషాలు నడవాలని, పండ్లను కేవలం ఉదయం పూట మాత్రమే తీసుకోవాలని తెలిపారు. ప్రతి రాత్రి 7-8 గంటలు నిద్రపోవాలన్నారు. నిద్రకు ముందు మొబైల్, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. చక్కెర ఉన్న టీ బదులుగా గ్రీన్ టీ లేదా నిమ్మరసం తాగాలని సూచించారు. స్వచ్ఛమైన గాలి, పచ్చదనం మనసుకు ప్రశాంతతను ఇస్తాయన్నారు. ఒత్తిడితో కూడిన మనసు ఆరోగ్యవంతమైన శరీరాన్ని కూడా నాశనం చేస్తుందన్నారు.

మారిటైమ్ వీక్‌లో
హెచ్‌ఎస్‌ఎల్ కీలక ఒప్పందాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ముంబయిలో అక్టోబర్ 27 నుండి 31 వరకూ జరిగిన ఇండియా మారిటైమ్ వీక్ -2025లో మినీరత్న కంపెనీ అయిన హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ పలు కీలక ఒప్పందాలు చేసుకోవటంతో పాటు సంస్థ సామర్థ్యాలను ప్రదర్శించింది కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎస్‌ఎల్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కమోడోర్ గిరిదీప్ సింగ్ ప్రాంభించారు. ఈ స్టాల్‌లో హెచ్‌ఎస్‌ఎల్ నౌకానిర్మాణం, నౌకల మరమ్మతు, జలాంతర్గాముల మరమ్మతు, గ్రీన్ ప్రొపల్షన్ కార్యక్రమాలలో తన సామర్థ్యాలను ప్రదర్శించింది. ప్రధాని మోడీ సహా పలువురు ప్రముఖులు, విధాన రూపకర్తలు, ప్రపంచ వాటాదారులు హాజరైన ఈ కార్యక్రమంలో గ్రీన్ టెక్నాలజీ, షిప్ రిపేర్, డిజైన్ భాగస్వామ్యం, నౌకానిర్మాణం వంటి రంగాలలో సహకారాన్ని పెంచడానికి హెచ్‌ఎస్‌ఎల్ భారతీయ, అంతర్జాతీయ సంస్థలతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుంది. భారత ప్రభుత్వ గ్రీన్ టగ్ ట్రాన్సిషన్ ప్రోగ్రామ్ కింద హైడ్రోజన్ టగ్‌ల అభివృద్ధి కోసం ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్‌తో ఒక ముఖ్యమైన ఒప్పందంపై సంతకం చేసింది. అదేవిధంగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌తో వారి నౌకల డాకింగ్, మరమ్మతు కోసం ఒప్పందం కుదుర్చుకుంది. భారతదేశం, కొరియా, మధ్యప్రాచ్యం నుండి ఇతర ప్రముఖ భాగస్వాములతో వ్యూహాత్మక సహకార ఒప్పందాలను కూడా చేసుకుంది. హెచ్‌ఎస్‌ఎల్ భవిష్యత్తు ప్రణాళికలలో భాగంగా ప్లాట్‌ఫామ్ సప్లై వెస్సల్స్, మీడియం రేంజ్ ట్యాంకర్లు వంటి వాణిజ్య నౌకల కోసం, ల్యాండింగ్ ప్లాట్‌ఫామ్ డాక్స్ వంటి నౌకాదళ ప్లాట్‌ఫామ్‌ల కోసం బిడ్ చేయడానికి సిద్ధమవుతోందని, .దీర్ఘకాలిక వృద్ధి వ్యూహంలో భాగంగా రక్షణ, వాణిజ్య నౌకానిర్మాణ ప్రాజెక్టుల పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డ్ అభివృద్ధిని కూడా హెచ్‌ఎస్‌ఎల్ అన్వేషిస్తోందని అధికారులు తెలిపారు.



ఒప్పంద పత్రాలతో హెచ్‌ఎస్‌ఎల్ అధికారులు

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయటానికి కార్మిక వర్గం అన్ని విధాల సహకరించాలని సంఘం రాష్ట్ర నాయకులు ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం కంచరపాలెంలోని బొట్టా నరసింగరావు భవనంలో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభ ప్రాధాన్యతను వివరించారు. యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు, గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, నాయకులు గొలగాని అప్పారావు, ఒమ్మి అప్పారావు, జెఆర్.నాయుడు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో మాయా వరల్డ్ ప్రారంభం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖ సాగరతీరంలో టియు-142 ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మాయా వరల్డ్‌ను విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ప్రారంభించారు. శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన తదుపరి ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా విశాఖలో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన 'ఇమాజిన్ రూమ్స్' తరహాలో రూపొందించిన ఈ మ్యూజియం ఆకట్టుకుంటోందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ఇఇ దుర్గా ప్రసాద్, డిఈ మూర్తి, మాయావరల్డ్ నిర్వాహకులు కెప్టెన్ ఎన్.ఆర్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: 36 వ వార్డులో జామియా మసీదును ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఎమ్మెల్యేకు మసీద్ పెద్దలు స్వాగతం పలికారు. మసీద్ పునర్నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మసీదు పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇచ్చిన హామీ ప్రకారం మసీదు నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. నిర్మాణానికి సహాయ సహకారాలు అందించిన వక్‌బోర్డు, మసీదు కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మసీదు కమిటీ రెన్యువల్ కాపీని అందజేశారు. చివరిగా గార్విషరీఫ్‌లో పాల్గొని విందు స్వీకరించారు. కార్యక్రమం లో వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్, మసీద్ అధ్యక్షులు అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

యుపిఎస్‌సి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో నవంబర్ 2న జరగబోయే యుపిఎస్‌సి పరీక్షల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూం అశోక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం 3268 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. 7 సెంటర్లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, జనరల్ ఆటిట్యూడ్ టెస్ట్ పరీక్ష ఉదయం 9:30 నుంచి 11:30 గంటల వరకు, ఆయుర్వేద టెస్ట్ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకూ జరుగుతుందన్నారు.

నేటి నుంచి ఎఫ్‌సిఎల్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పోర్టు అథారిటీ క్రికెట్ స్టేడియం వేదికగా శనివారం నుంచి ఫ్రెండ్స్ క్రికెట్ లీగ్ (ఎఫ్‌సిఎల్) ప్రారంభం కానుంది. దీనికి సంబంధించిన జెర్సీని నిర్వాహకులు కరణ్, భార్గవ్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు కరణ్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఈ టోర్నీలో 14 ఫ్రాంచైజ్ జట్లు పాల్గొంటాయన్నారు. 2023లో మొదలు పెట్టిన ఈ లీగ్‌లో మొదటి ఎడిషన్‌లో 10 జట్లు పాల్గొనగా, 2024లో జరిగిన రెండో ఎడిషన్‌లో 12 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. ఐపిఎల్ తరహాలో ఇటీవల గోవాలో జరిగిన సభ్యుల వేలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత స్థాయి క్రికెటర్లను వివిధ ఫ్రాంచైజర్లు కొనుగోలు చేసి జట్లను పటిష్టంగా రూపొందించాయని తెలిపారు.

డ్రైవర్ పోస్టుల భర్తీకి చర్యలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఆర్‌టిసి విశాఖపట్నం రీజియన్‌లో డ్రైవర్ పోస్టుల భర్తీకి సన్నాహాలు చేస్తున్నామని ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ బి. అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ద్వారకా బస్సు కాంప్లెక్స్‌లో మీడియాతో మాట్లాడారు. ఆర్టిసిలో ఇటీవల వివిధ స్థాయిల్లో ప్రమోషన్లు ఇచ్చిన కారణంగా రీజియన్ పరిధిలో అన్ని డిపోల్లో డ్రైవర్స్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని వీటిని భర్తీ చేస్తామన్నారు. ఐటిఐ చేసి,18 నెలలు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు సంప్రదించవచ్చన్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వీరిని తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి, అసిస్టెంట్ మేనేజర్,జి . శ్రీధర్ పాల్గొన్నారు.

మొంథా తుపాన్ దెబ్బకు

వేములవలస పూల మార్కెట్ వెలవెల!

• కష్టాల్లో రైతులు • నష్టాల్లో ఆశీలు కాంట్రాక్టర్ • అధిక ధరలతో వినియోగదారుల గగ్గోలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఉత్తరాంధ్రలో అతి పెద్ద పూలమార్కెట్‌గా పేరుగాంచిన మండలంలోని వేములవలస మహాత్మాగాంధీ డైలీ పూల మార్కెట్ వెలవెలబోతోంది. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రైతులు, ఆశీలు వసూలు కాంట్రాక్టర్లు తీవ్ర నష్టాలను చవిచూశారు. వీడకుండా కురిసిన వర్షాలకు పండించిన పువ్వులు, కూరగాయలను రైతులు పొలాలు, తోటల్లోంకి సేకరించడం, మార్కెట్‌కు తీసుకురావడం వీలుకాని పరిస్థితుల్లో క్రయవిక్రయాలు దాదాపు నిలిచిపోయాయి. ఫలితంగా మార్కెట్ ఆశీలు, కాంట్రాక్టర్లు భారీ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. లక్షల్లో ఆశీలు పాట పాడుకున్న కాంట్రాక్టర్లు, మార్కెట్ వెలవెలబోయిన పరిస్థితుల్లో పంచాయతీకి జమ చేయాల్సిన నిధులు కూడా వసూలురాకపోవడంతో కష్టాల్లో ఉన్నారు. ప్రస్తుతం రోజుకు రూ.రెండు వేలు కూడా రావడం లేదని, సిబ్బంది జీతాల చెల్లింపులకూ ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని మార్కెట్ వర్గాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలకు పొలాల్లోని పూలు, కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లడంతో ప్రస్తుతానికి పంట లభ్యత లేకపోగా, ఆయా పొలాల్లోంచి మళ్లీ ఫలసాయం చేతికి రావాలంటే కనీసం 50 నుంచి 60 రోజులు పట్టే అవకాశం ఉందని రైతులు, కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్‌పై ఆధారపడి జీవించే అనేక కుటుంబాలు జీవన పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా రైతులు పండించిన ఉత్పత్తులు అందుబాటులో లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి బయట వ్యాపారుల ద్వారా సరుకులు తెప్పించి విక్రయాలు చేపట్టడంతో గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. రవాణా, ఇతరత్రా ఖర్చులతో గిట్టుబాటైన ధరకు విక్రయించాల్సిన పరిస్థితుల్లో గతం కంటే అధిక ధరలకు అమ్ముకాలు చేయాల్సిన పరిస్థితుల్లో ధరాభారంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతు న్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికారులు పూలమార్కెట్‌లో నెలకొన్న సమస్యలను గుర్తించాలని, అందరికీ ఆమోదయోగ్యమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కాంట్రాక్టర్లకు ఆశీలు వసూలు పూర్తిగా తగ్గిపోయిన నేపథ్యంలో మినహా యింపులు ఇవ్వాలని వేములవలస పూల మార్కెట్ కాంట్రాక్టర్ పతివాడ పుష్పలత విజ్ఞప్తి చేశారు.



అమ్మకం, కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న వేములవలస డైలీ మార్కెట్

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మధురవాడ : భీమిలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల భార్య కల్యాణిని ఉద్దేశించి, కల్పిత వీడియోలతో ట్విట్టర్‌లో అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని భీమిలి జనసేన నాయకులు కోరారు. శుక్రవారం నార్త్ జోన్ ఏసిపి అప్పలరాజుకు ఫిర్యాదు చేశారు. విశాఖ బీచ్ రోడ్‌లో మద్యం మత్తులో పోలీసు అధికారులపై సీసాలు విసిరి, తన భర్త రాజకీయ అండతో బెదిరిస్తున్నట్లు సంబంధం లేని తప్పుడు కల్పిత వీడియోలు పెట్టి, సందీప్‌తో వారి కుటుంబం పరువు, ప్రతిష్టలను నష్టం కలిగించేలా దురుద్దేశ్యపూర్వకంగా పప్పు అనే వ్యక్తి (@DrShivudu) హ్యాండిల్ కింద ట్విట్టర్ వైరల్ చేస్తున్న వీడియోలపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని భీమిలి మార్కెటింగ్ చైర్మన్ స్వామినాయుడు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యంపై కేసు నమోదైంది. సిఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి. నగరంలోని ఆరిలోవ దరి పైనాపిల్ కాలానికి చెందిన బంగారు ప్రవళిక మధురవాడలోని సేవానగర్‌లో అత్తారింటికి గత నెల 11న వచ్చింది. తన కుమార్తెను ఇంటిలో ఉంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త జగదీశ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ మేరకు హెచ్‌సి నరసింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి వనరుల క్లోరినేషన్

ప్రజాశక్తి తగరపువలస : మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో తాగునీటి వనరులు కలుషితం కాకుండా భీమిలి మండలం పరిధిలోని 16పంచాయతీలలో బావులను క్లోరినేషన్ చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ విభాగం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో వాటర్ సప్లై పంపు ఆపరేటర్లు క్లోరినేషన్ చేపట్టారు. చిప్పాడ సిటీనగర్‌లో క్లోరినేషన్ ప్రక్రియను ఎఇఇలు దుర్గ భవాని స్వాతి పరిశీలించారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆర్జిత సేవల్లో భాగంగా నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో మండపంలో అధిష్టింపజేసిన అర్చక స్వాములు, పాంచరాత్రాగమ శాస్త్రం విధానంలో కల్యాణ క్రతువును కమనీయంగా జరిపించారు. పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలు, ప్రసాదా లను అందజేసి, అంతరాలయ దర్శనం కల్పించారు.

పలుచోట్ల ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- సీతమ్మధార. : సీతమ్మధార అల్లూరి విగ్రహం వద్ద ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ జెండాలను రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాలలో ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవంలో నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆర్ఎంఒ డాక్టర్ నవీన్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్షులు పి తులసీరాం, కార్యదర్శి ఎస్.సౌమ్య, ఎస్ వెంకటరావు, ఎఐటియుసి రాష్ట్ర సహాయ కార్యదర్శి పి అప్పారావు జిల్లా కార్యదర్శి మహ్మద్ ధురానీ పాల్గొన్నారు.

గాజువాక.: భెల్‌లో ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ జెండాను సీనియర్ ఉద్యోగి ఎస్ గోవిందరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పివిఎన్ఎస్.రాజు, గుర్తింపు యూనియన్ అధ్యక్షులు బోండా బాబూరావు, ప్రధాన కార్యదర్శి సుబాకర్ సాహు, కొల్లి దేముడు బెక్కలి భాస్కరరావు, పి వీరబాబు, బి రవీంద్రబాబు, సూర్య కుమార్, ఏ వెంకట్రావు,, ఎన్ బి ప్రశాంత్ కుమార్, పాల్గొన్నారు.

ములగాడ : సింధియా జంక్షన్ వద్ద ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా యూనియన్ పతాకాన్ని రాష్ట్ర కార్యవర్గ నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ ఎగురవేశారు. కార్యక్రమంలో యూనియన్ పారిశ్రామిక ప్రాంత కన్వీనర్ గుడాల రాంబాబు, హిందుస్థాన్ షిప్‌యార్డు నాయకులు మధుసూదనరావు, గండి అప్పారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు



అనకాపల్లిలో పతాకావిష్కరణలో ఎఐటియుసి నేతలు

అనకాపల్లి రూరల్ : ఏఐటియుసి వ్యవస్థాపన దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయం వద్ద ఏఐటియుసి జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు రాజాన దొరబాబు, వైఎన్ భద్రం, విత్తనాల పోతురాజు, వియ్యపురాజు, ఎం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా, ఏఐటీయూసి జెండాను జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏసుదాసు ఎగరవేశారు. యలమంచిలి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ రాజు ముఖ్య అతిథిగా వచ్చి కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.నూకరాజు, సిహెచ్.వెంకటరమణ, డి.మహేష్, జె.వెంకటరమణ, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

సుంకరి ఆళ్వార్‌దాస్‌కు ఘననివాళి



ఆళ్వార్‌దాస్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కోఆర్డినేటర్

ప్రజాశక్తి- పెందుర్తి : ఆళ్వార్‌దాస్ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మాజీ మంత్రి సుంకరి ఆళ్వార్‌దాస్ 95వ జయంతిని గోపాలపట్నంలో నిర్వహించారు. క్యాంపస్ లోని ఆళ్వార్‌దాస్ విగ్రహానికి కోఆర్డినేటర్ జివిఎస్ భగవాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలో అనేక విద్యా సంస్థలను స్థాపించి, వేలాదిమంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నతవిద్యను అందించడంలో ఆళ్వార్ దాస్ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు వహించాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ బి ప్రభావతి సూచించారు. జివిఎంసి 25వ వార్డు సీతంపేట, గణేష్ నగర్ ప్రాంతాలలో పర్యటించి ఫ్రైడే డ్రై డే అమలు తీరును పరిశీలించారు

ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను తనిఖీలు చేశారు దోమలు, లార్వాలు వృద్ధి, నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ గణేష్ పట్నాయక్ ఎంపీహెచ్వో తిరుపతిరావు, హెల్త్ అసిస్టెంట్లు కె.శ్రీనివాస్ రెడ్డి, మహేష్ కరణం, ఎఎన్ఎంలు తదితరులుపాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమత కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థి శుక్రవారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఉరేసుకుని ఆయన చనిపోయిన తీరు పట్ల పలు అనుమానాలు కలుగుతున్నాయి. అతడి మృతికి ఇద్దరు మహిళా లెక్చరర్ల లైంగిక వేధింపులే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎంవిపి పోలీసుల కథనం మేరకు.. ఎంవిపి.కాలనీకి చెందిన కోన సాయితేజ (21) స్థానికంగా ఉన్న సమతా కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. సాయితేజ మరణ వార్త విన్న తోటి స్నేహితులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

సాయి తేజను ఇద్దరు మహిళా లెక్చరర్లు లైంగికంగా వేధించారని, వారి వేధింపులు తట్టుకోలేక మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని వారు ఆరోపించారు. సదరు లెక్చరర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ షాక్‌తో మహిళా రైతు మృత్యువాత

ప్రజాశక్తి-అనకాపల్లి : విద్యుత్ షాక్‌తో ఒక మహిళా రైతు శుక్రవారం మృతి చెందిన సంఘటన మునగపాక మండలం మడక పాలెం గ్రామంలో చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన లగిశెట్టి సన్యాసమ్మ శుక్రవారం మధ్యాహ్నం పశువులను మేపుకునేందుకు వెళ్లింది. అప్పటికే తెగి ఉన్న విద్యుత్ వైర్లను చూడకుండా తాకడంతో షాక్‌కు గురై స్పృహ తప్పి పడిపోయింది. ఇది గమనించిన స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపి ఆమెను వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సన్యాసమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. విద్యుత్ శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం సన్యాసమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గల్లంతైన వ్యక్తుల మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి -పద్మనాభం : గెడ్డలో గల్లంతైన మండలంలోని మద్ది పంచాయతీ తునిపాలెం గ్రామానికి సంబంధించిన కళ్ళ ధనుష మృతదేహం లభ్యమైంది. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు గెడ్డలో కొట్టుకుపోయిన ధనుష మృతదేహం, పడిపోయిన స్థలానికి సుమారు కిలోమీటరు దూరంలో శుక్రవారం ఉదయం కనిపించింది.మృతదేహాన్ని బయటకు తీసి, భీమిలి ఆసుపత్రిలో పోస్టుమార్టం తర్వాత తల్లిదండ్రులకు అప్పగించగా, అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో తహశీల్దార్ కె.ఆనందరావు ఎస్ఐ సురేష్, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రామస్వామి నాయుడు, టిడిపి మాజీ అధ్యక్షులు కె.నగేష్‌కుమార్ పాల్గొన్నారు.

కె.కోటపాడులో....

కె.కోటపాడు : భారీ వర్షాల నేపథ్యంలో ప్రమాదవశాత్తు గెడ్డలో కొట్టుకుపోయిన చౌడువాడకు చెందిన బంటు అప్పలనాయుడు (32) మృతదేహం చౌడువాడకు సమీపంలోని రాపేటి వారి కల్లాల వద్ద తుప్పల్లో లభ్యమైంది. అప్పలనాయుడు గత మంగళవారం పశువుల మేత కోసం చిట్టిగెడ్డ వద్దకు వెళ్లగా అప్పటికే నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదవశాత్తు గెడ్డలో కొట్టుకుపోయాడు. పశువులను మేత కోసం తీసుకువెళ్లిన తన కుమారుడు ఇంటికి చేరకపోవడంతో తల్లి గౌరమ్మ బుధవారం కె.కోటపాడు పోలీసులకు సమాచారం అందించింది. స్థానిక పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బృందం గెడ్డవద్దకు చేరి చుట్టుపక్కల గాలించినా అప్పలనాయుడు ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు.

శుక్రవారం తెల్లవారుజామున నీటి ఉధృతి తగ్గడంతో సమీపంలోని రాపేటి వారి కల్లాల వద్ద గెడ్డ వద్ద తుప్పల్లో మృతదేహాన్ని గుర్తించారు. దీంతో చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకనాయుడు పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కె.కోటపాడు ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై ధనుంజయ్ తెలిపారు. మృతునికి తల్లి గౌరమ్మ భార్య లక్ష్మి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృత్యువాత చెందడంతో తమకు దిక్కేవరంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

ఉక్కు పరిరక్షణతోనే మనుగడ



రిటైర్డ్ ఉద్యోగుల సత్కార సభలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ప్రజాశక్తి- గాజువాక : లక్షల మందికి ఉపాధిని, జీవితాన్నిచ్చిన తల్లిలాంటి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, తద్వారా అందరి మనుగడ సాధ్యమని స్టీల్ ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి జె.అయోధ్యరామ్ అన్నారు. తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగవిరమణ చేసిన కె. వెంకటేశ్వర్లు, కె.చిన్నంనాయుడు, ఎస్ సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముగ్గురు కార్మికులూ విశాఖ స్టీల్‌ప్లాంట్, సిఐటియులోనూ కీలక భూమిక పోషించారన్నారు. వీరి సేవలు సిఐటియుకు అవసరమన్నారు. ప్రభుత్వరంగంలో స్టీల్‌ప్లాంట్ ఉండడం వల్లే టౌన్‌షిప్‌లో పది విద్యాసంస్థలు నెలకొల్పబడి, 50వేలకుమందికి పైగా విద్యార్థులు ఉన్నతచదువుతో సమున్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లేకపోతే ప్రస్తుతం రూ.43,500 ఉన్న స్టీలు ధర, ప్రైవేటుకు చేతికి వెళ్తే రూ.లక్ష ఎపుడో దాటేదన్నారు.

. సిఐటియు నాయకులు ఎన్ రామారావు మాట్లాడుతూ, కార్మికరాజ్యం సాకారమే లక్ష్యంగా కృషిచేస్తున్న సిఐటియులోని వారంతా క్రమశిక్షణ,నిబద్ధతతో పనిచేస్తారన్నారు. సామాజిక స్పృహతో తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ కాలుష్యంపైనా, అంబుజా సిమెంట్‌కు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలు అభినందనీయమన్నారు. ఇపుడు ఉక్కు ఉద్యోగులను సత్కరిస్తున్నారని, ఇదే పంథాను కొనసాగించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షులు జె రామన్న అధ్యక్షతన జరిగిన సత్కార సభలో కార్యదర్శి కె.శ్రీనివాస్ చౌదరి, ఉపాధ్యక్షులు తౌడన్న, రమణ, మహిళా కమిటీ నాయకులు రమణి, శాంతి పాల్గొన్నారు.

భీమిలి అభివృద్ధికి సహకారం



పవన్ కల్యాణ్‌తో గంటా రవితేజ దంపతులు

ప్రజాశక్తి -మధురవాడ : భీమిలి అభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తానని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ భరోసానిచ్చారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు, తెలుగు యువత నేత గంటా రవితేజ అన్నారు శుక్రవారం కుటుంబ సమేతంగా మంగళగిరిలో పవన్ కల్యాణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. భీమిలిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు.. కొత్తగా వస్తున్న ప్రాజెక్టుల గురించి వివరించారు. రవితేజ చేపడుతున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను అభినందించిన పవన్‌కల్యాణ్, మరింత విస్తృతం చేయాలని సూచించారు. రవితేజ సతీమణి, నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్ శరణి, కుమారుడు ఆర్యన్ ఉన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలి : సిపి

ప్రజాశక్తి- సీతమ్మధార : పోలీస్ స్టేషనుకు వచ్చే ఫిర్యాదారులు పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బగ్చి సూచించారు. శుక్రవారం ద్వారకా పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించ వద్దని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీల కదలికలపై ప్రత్యేకంగా నిఘా పెట్టి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్టేషన్‌లో కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ద్వారకా సిఐ రమణ, ఎస్ఐలు ధర్మేంద్ర, తాతబ్బాయి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాట్యుటీ పెంపుపై నిర్ణయం తీసుకోవాలి

- కార్మికుల విభాగాల మార్పుపై ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలి
- సిజిఎం (వర్క్స్), జిఎం (హెచ్‌ఆర్)లకు స్టీల్ సిఐటియు వినతి



జిఎం (హెచ్‌ఆర్)కు వినతిపత్రం ఇస్తున్న స్టీల్ సిఐటియు నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : ప్రభుత్వం అనుమతించిన విధంగా రూ.25 లక్షల గ్రాట్యుటీపై విశాఖ స్టీల్ యాజమాన్యం తగిన నిర్ణయం తీసుకోవాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జె అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో సిజిఎం(వర్క్స్) రంజన్ మహంతి, జీఎం (హెచ్ఆర్) భానును వారి కార్యాలయాల్లో కలిసి గ్రాట్యుటీ, విభాగాల మార్పు పేరుతో స్టీల్ కార్మికులకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జె అయోధ్య రామ్ మాట్లాడుతూ ప్రభుత్వం రూ.20 లక్షల గ్రాట్యుటీ సీలింగ్‌ను రూ.25 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. 1982లో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్ నుంచి విడదీసిన సమయంలో సెయిల్ యాజమాన్యం అంగీకరించిన అంశాలను యథాతథంగా అమలు చేస్తామని ఒప్పుకుందని, దానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని గుర్తు చేశారు. సెయిల్ యాజమాన్యం అక్టోబర్ ఒకటో తేదీ నుంచే అమలు చేస్తామని సర్కులర్ జారీ చేసిన నేపథ్యంలో విశాఖ యాజమాన్యం కూడా గ్రాట్యుటీపై సర్కులర్ జారీ చేసి తమ అంగీకారాన్ని తెలియజేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు యు.రామస్వామి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌లో పనిఒత్తిడి పెరిగిన నేపథ్యంలో వివిధ విభాగాల కార్మికులను ప్రొడక్షన్ విభాగాల్లోకి మార్చే ముందు కార్మికులకు అక్కడ భద్రతపై సూచనలు, సలహాల కోసం యూనియన్లతో సంప్రదించే సాంప్రదాయాన్నిస్టీల్ యాజమాన్యం పాటించాలని గుర్తు చేశారు. ఏకపక్ష నిర్ణయాలతో కార్మికుల ప్రాణాలతో స్టీల్‌యాజమాన్యం చెలగాటమాడుతోందని విమర్శించారు. ఉక్కు యాజమాన్యం ఒంటెద్దు పోకడలకు స్వస్తి పలికాలని, ఉత్పత్తి పెరుగుదలతో పాటు కార్మికుల ప్రాణరక్షణను పరిగణనలోకి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు బి మహేష్, పి శ్రీనివాసరాజు, శ్రీనివాస్ రెడ్డి, పవన్, సూరిబాబు, దానయ్య పాల్గొన్నారు.

వి సెజ్ ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి

- ఈ ఏడాది రెండో క్వార్టర్‌లో రూ.58,505 కోట్ల ఎగుమతులు



శ్రీనివాస్ ముప్పాళ్ల, విసెజ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ 'వి సెజ్' ఎగుమతులలో గణనీయమైన వృద్ధి సాధించిందని విసెజ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్, శ్రీనివాస్ ముప్పాళ్ల తెలిపారు. జూలై నుంచి సెప్టెంబర్ వరకు రెండవ త్రైమాసికంలో రూ.58,505 కోట్ల ఎగుమతులను నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 4.34శాతం వృద్ధి నమోదైంది. మొత్తం ఎగుమతులలో సర్వీస్ రూ.43,871 కోట్లు కాగా, మర్చండైజ్ రూ.14,634 కోట్లు నమోదైందన్నారు. గడిచిన ఆరు నెలల్లో విసెజ్ మొత్తం రూ.1,17,050 కోట్ల ఎగుమతులను నమోదు చేయగా, వీటిలో మర్చండైజ్ రూ.30,414 కోట్లు, సర్వీస్ ఎగుమతులు రూ.86,636 కోట్లు ఉన్నాయి. గతేడాది ఇదే అర్ధసంవత్సరం ఎగుమతులతో పోలిస్తే ఏడు శాతం వృద్ధి నమోదైంది.

తెలంగాణ, ఆంధ్రాలో ఐదు కొత్త సెజ్ యూనిట్లు

జూలై, సెప్టెంబర్ 2025 త్రైమాసికంలో తెలంగాణలో మూడు, ఆంధ్రాలో రెండు కొత్త సెజ్ యూనిట్ ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని శ్రీనివాస్ ముప్పాళ్ల తెలిపారు. కొత్తగా మంజూరైన సెజ్ యూనిట్లలో రూ.467.5 కోట్ల పెట్టుబడితో 1032 మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

విశ్వవేదికపై విశాఖ వైద్యుల ఘనత

- టిసిటి అంతర్జాతీయ సదస్సులో అపోలో డాక్టర్స్ బారువ, పాణిగ్రాహి



డాక్టర్ డికె.బారువ



డాక్టర్ ఎన్‌కె.పాణిగ్రాహి

ప్రజాశక్తి - ఆరిలోవ : అమెరికాలోని శాన్ఫ్రాన్సిస్కోలో ముగిసిన ప్రతిష్టాత్మక 'ట్రాన్స్‌కాథెటర్ కార్డియోవాస్కులర్ థెరప్యూటిక్స్ (టిసిటి)-2025' సదస్సులో విశాఖ హెల్త్‌సిటీ అపోలో హాస్పిటల్స్ వైద్యులకు విశ్వవేదికపై సముచిత గౌరవం లభించింది. గ్లోబల్ కార్డియాలజీ ఫోరమ్‌లో అపోలో సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్, క్యాత్‌ల్యాబ్ డైరెక్టర్ డాక్టర్ డికె. బారువ, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎన్‌కె. పాణిగ్రాహి అధ్యయన పత్రాలను సమర్పించారు.

కాల్షియం నిక్షేపాలతో కూడిన సంక్లిష్ట కరోనరీ ఆర్టరీ వ్యాధి (సిఎడి) చికిత్సలో తన విశేష అనుభవాన్ని, నూతన అధ్యయన ఫలితాలను డాక్టర్. డి.కె. బారువ, సమర్పించారు.వృద్ధులు, రక్తపోటు, మధుమేహం ఉన్న రోగులకు సంక్లిష్ట కరోనరీ ఆర్టరీ వ్యాధి చికిత్సలో భాగంగా "యుటిలిటీ ఆఫ్ అల్ట్రా హై ప్రెజర్ బెలూన్" అనే అధ్యయన ఫలితాన్ని వెల్లడించారు. ఈ అధ్యయన ఫలితం అదే సదస్సులో సమర్పించిన ముఖ్యమైన ట్రయల్‌కు సమానంగాఉంది. ఈ పరిశోధనా సారాంశాన్ని ప్రతిష్టాత్మక జర్నల్ ఆఫ్ అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ (జెఎసిసి)లో ప్రచురితం కానుంది. ఓపెన్ హార్ట్ సర్జరీకి కూడా సరిపడని విస్తృత సంక్లిష్ట కరోనరీ వ్యాధికి, డ్రగ్ కోటెడ్ బెలూన్ (డిసిబి), డ్రగ్-ఎలుటింగ్ స్టెంట్‌లను ఉపయోగించే హైబ్రిడ్ చికిత్సా విధానాన్ని డాక్టర్. బారువ ప్రదర్శించారు. డిసిబి సాంకేతికత ద్వారా ధమనులలో మెటల్ స్టెంట్లు లేకుండానే బ్లాకులకు చికిత్స చేయవచ్చని,భవిష్యత్తులో ఇతర చికిత్సలకు మార్గాలు సుగమం చేస్తుందని వివరించారు.ఇక డాక్టర్ ఎన్‌కె. పాణిగ్రాహి రెగ్యులర్ సర్జరీ చేయలేని హార్ట్ ఫెయిల్యూర్ రోగిని రక్షించడానికి చేసిన క్లిష్టమైన చర్మాంతర్గత చికిత్సా విధానాన్ని వివరించారు. సంక్లిష్ట కరోనరీ, వాల్వులర్ ఇంటర్వెన్షన్‌లో తమ నైపుణ్యం, అనుభవాలను స్పెషల్ ప్యానెలిస్ట్‌లుగా డాక్టర్ బారువ, డాక్టర్ పాణిగ్రాహి అంతర్జాతీయ కార్డియాలజిస్టులతో పంచుకున్నారు.

ప్రేమానందరావుకు ఘన సన్మానం



ప్రేమానందరావును సన్మానిస్తున్న రఘు వర్మ, తదితరులు

ప్రజాశక్తి - ఆనందపురం: ఉద్యోగ విరమణ చేసిన ఆనందపురం జెడ్‌పి హైస్కూల్ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు డాక్టర్ కుర్మాన ప్రేమానందరావును శుక్రవారం పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం కె కామేశ్వరరావు ఆధ్వర్యంలో సత్కారసభలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పూర్వ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ, వృత్తి పట్ల నిబద్ధతతో పని చేసిన ప్రేమానందరావు విద్యార్థులు, తల్లిదండ్రుల ఆదరాభిమానాలు చూరగొన్నట్లు కొనియాడారు. తోటి ఉపాధ్యాయులతో స్నేహపూర్వకంగా మసలుతూ, అందరి కష్ట సుఖాల్లో పాలుపంచుకునే వారన్నారు.ఎపిటిఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షులు బి వెంకటపతిరాజు మాట్లాడుతూ విద్యాశాఖలో తొలినాళ్లలో క్రియాశీలమైన ఎంఆర్‌పి బాధ్యతను సమర్థవంతంగా ప్రేమానందరావు నిర్వహించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయులుకు సత్కారం



ఆంజనేయులు సన్మానిస్తున్న అధికార్లు, తోటి ఉద్యోగులు

ప్రజాశక్తి- ములగాడ : షిప్ యార్డ్ కాలనీ పంపుహౌస్‌లో విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ చేసిన ఆంజనేయులును శుక్రవారం ఘనంగా సత్కరించారు. కాలనీ పంప్‌హౌస్ వద్ద సీనియర్ మేనేజర్ పి అనిల్ కుమార్, డిప్యూటీ మేనేజర్ ఎస్ అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొని, ఆంజనేయులును సత్కరించారు.కార్యక్రమంలో పంపుహౌస్, కాలనీ ఎలక్ట్రికల్, సివిల్ మెయింటనెన్స కార్మికులు సుమన్, మురళి, కమల్ నాయుడు, రెడ్డి, ఫరీద్, రామకృష్ణ, టిఎన్‌టియుసి నాయకులు శ్రీను పాల్గొన్నారు.

గీతంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ప్రాయోజిత బిఎస్‌సి కోర్సు



తరగతుల ప్రారంభోత్సవంలో విద్యార్థులు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయనిక శాస్త్ర విభాగంతో కలిసి ఔషధ పరిశ్రమ డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ పారిశ్రామిక అవసరాలను అనుగుణంగా నిర్వహిస్తున్న బిఎస్‌సి కెమిస్ట్రీ డిగ్రీ కోర్సు తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ సైన్స్ కెమిస్ట్రీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎన్‌వివిఎస్ వేణుగోపాల్ మాట్లాడుతూ, విద్యార్థుల ఎంపికతో పాటు వారి చదువుకయ్యే వ్యయాన్ని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ పూర్తిగా భరించడం అభినందనీయమన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా రసాయన శాస్త్రంలో పిజి కోర్సు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గీతంలో శాస్త్ర పరిశోధనలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, అధునాతన ప్రయోగశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ మానవ వనరుల విభాగం మేనేజర్ ఎమ్.లక్ష్మీదుర్గా, కోఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.సురేష్ పాల్గొన్నారు.

శిథిలమైన రహదారులు



పెద్ద గొయ్యిపడిన కొండుపాలెం వెళ్లే రహదారి

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు అనకాపల్లి మండలంలో రహదారులు శిథిలమయ్యాయి. ఎక్కడికక్కడ గోతులతో అస్తవ్యస్తంగా కనిపిస్తున్నాయి. ప్రయాణానికి ఇబ్బందికరంగా మారాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న కొన్ని చోట్ల రోడ్లు తుపాను దెబ్బకు పూర్తిగా చిన్నాభిన్నమయ్యాయి. అనకాపల్లి మండలంలోని కొండపాలెం, మార్టూరు, దిబ్బపాలెం తదితర గ్రామాలతో అనకాపల్లి పట్టణంలో పలు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులకు ప్రమాదాలు తప్పడం లేదు. పాడైపోయిన రహదారులను త్వరగా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఏటా వర్షాల తర్వాత ఇదే దృశ్యం కనిపిస్తుంది. తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. ఈసారైనా స్థిరమైన రోడ్లు వేయాలని మరికొందరు డిమాండ్ చేస్తున్నారు.

దెబ్బతిన్న పెద్దేరు డైవర్షన్ రోడ్డు

బుచ్చెయ్యపేట : మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని వడ్డాది వద్ద పెద్దేరు నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద్దేరు నదిపై నిర్మాణం చేసిన డైవర్షన్ వంతెనపై నుండి నీటి ప్రవాహం కొనసాగుతుంది. వరద ఉధృతికి వడ్డాదిలో డైవర్షన్ వంతెన పాక్షికంగా దెబ్బతింది. చివరి భాగంలో కొంతమేరకు సిసి రోడ్డు కొట్టుకుపోయింది. రాళ్లు, కాంక్రీట్ బయటకొచ్చేసి గోతులుగా ఏర్పడ్డాయి ప్రవాహం తగ్గాక తక్షణమే దీనిని పునరుద్ధరించకపోతే వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుంది. పాత శిథిల వంతెనపై పెద్ద వాహనాలకు అనుమతి లేకపోవడంతో డైవర్షన్ వంతెన పైనుండి రాకపోకలు సాగించేవి. వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా ఇప్పుడు డైవర్షన్ వంతెన కూడా దెబ్బతింది. ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్పందించి నదిలో నీటి ప్రవాహం తగ్గిన వెంటనే డైవర్షన్ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



వడ్డాది వద్ద శిథిలమైన డైవర్షన్ వంతెన



గోతులు పడిన ఎస్.రాయవరం -యలమంచిలి రహదారి

రోడ్లన్నీ గుంతల మయం

యస్.రాయవరం : మండలంలోని పలు గ్రామాలలో ఆర్ అండ్ బి రోడ్లు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారయ్యాయి. మండల కేంద్రం ఎస్.రాయవరం నుండి యలమంచిలి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు సైతారుపేట మలుపు వద్ద వర్షపు నీరు నిల్వ ఉండడంతో రహదారిపై గోతులు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురువుతున్నారు. నిల్వ ఉన్న నీరు పక్కకు పోయే మార్గం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపార కేంద్రం ఆయన అడ్డరోడ్డు నుండి బంగారమ్మపాలెం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు తిమ్మాపురం శివారు సన్‌సైన్ హాస్పిటల్ వద్ద భారీ గొయ్యి ఏర్పడటంతో ఆ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి గోతులు పుడ్చే చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



శ్రీరాంపురంలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : మండలంలోని తిమ్మాపురం, పెదగుమ్ములూరు, చిన ఉప్పలం గ్రామాలలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. వీటిని డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ పరిశీలించారు. సూపర్ శానిటేషన్, సూపర్ క్లోరినేషన్ పనులు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తిమ్మాపురం పంచాయతీ కాలనీలో నిల్వ ఉన్న నీటిని పైపుల ద్వారా తొలిగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

పాయకరావుపేట : మండలంలోని శ్రీరాంపురంలో శుక్రవారం ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ గారా కృష్ణ ప్రసాద్, సెక్రటరీ వైవి సత్యనారాయణ దగ్గరుండి ఈ పారిశుధ్య పనులు చేయించారు. భారీ వర్షాలకు రోడ్లపై పేరుకుపోయిన చెత్త, అపారిశుధ్యాన్ని పూర్తిగా తొలగించారు.



వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహశీల్దారు

పంట నష్టం నమోదుపై నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి-కోటవురట్ల : తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంటలో గుర్తించడం పట్ల నిర్లక్ష్యం చేయరాదని తహసీల్దారు తిరుమలబాబు అన్నారు. మండలంలో పలు ప్రాంతాలలో దెబ్బతిన్న వివిధ పంటలను త్వరితగతిన గుర్తించాలని ఆయన సూచించారు. వరి పంట సాక్షిగా కొన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్న అంశాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి సరోజినీ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సరుగుడు తోట విస్తారంగా సాగు చేస్తున్నారని, కొన్ని ప్రాంతాల్లో నేలకు ఒరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మణికంఠ, విఆర్ఓలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో నేతల పర్యటన

ప్రజాశక్తి-మునగపాక : తుపాన్ కారణంగా స్థానిక జగనన్న కాలనీ, ఎస్సీ కాలనీ, యాతపేట ప్రాంతాల్లో వరద నీరు చేరింది. ఈ ప్రాంతాలను వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాదు శుక్రవారం సందర్శించారు. వరద బాధితులను పరామర్శించి వారి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. తమ సొంత నిధుల నుండి భోజన వసతి కల్పిస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. వరద బాధితులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మార్వో సత్యనారాయణ కోరారు.

మునగపాక : వరద బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సంతబయల, ఎస్సీ కాలనీ, యాతపేట వీధులలో వరద వలన పూర్తిగా మునిగిపోయిన ప్రాంతాలలో శుక్రవారం ఆయన పర్యటించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రి సాయికృష్ణ, ఆడారి మంజు, భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, దాడి శివ, విల్లూరి నర్సింగరావు పాల్గొన్నారు.



ముంపు గ్రామంలో పర్యటిస్తున్న టిడిపి నాయకులు

ఒరిగిన విద్యుత్తు స్తంభం

విద్యార్థులకు తాగునీరు లేక ఇబ్బంది

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట హైస్కూల్ వద్ద 24 గంటలు విద్యుత్తు సరఫరా కోసం వేసిన విద్యుత్తు లైనుకు సంబంధించిన కరెంట్ స్తంభం ఒరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పంటకాలువ పక్కన విద్యుత్ స్తంభాల లైన్ వేయతడంతో కాలవలో నీరు వలన ఒక స్తంభం గురువారం సాయంత్రం ఒరిగి ప్రమాదకరంగా మారింది. వెంటనే లైన్‌మ్యాన్ స్పందించి ఒరిగిన విద్యుత్ స్తంభానికి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో సీతయ్యపేట హైస్కూల్‌కు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. పాఠశాలలో సుమారుగా 350 విద్యార్థులు చదువుతున్నారు. విద్యుత్ లేకపోవడంతో తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లకు కూడా నీటి సరఫరా ఆగిపోయింది. వెంటనే అధికారులు స్పందించి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించాలని కోరుతున్నారు.

నీట మునిగిన వరి, చెరుకు పంటలు

బుచ్చయ్యపేట : మొంథా తుపాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరి, చెరుకు పంటలు నీట మునిగాయి. వర్షం తగ్గినా చెరువుల్లో నీరు పంట పొలాల్లో చేరడంతో వరి, చెరుకు పంటలు నీటిలోనే ఉన్నాయి. మండలంలోని చిన్నప్పన్న పాలెం, దిబ్బిడి, బుచ్చయ్యపేట, పోలేపల్లి తదితర గ్రామాల్లో చెరువుల కిందన వరి పంట నీట మునిగింది. దిబ్బిడిలో తురకవాని చెరువు లోపల గల వరి పంట నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నీట మునిగిన పంటను కాపాడే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు పెదరెడ్ల శ్రీను కోరాడు.



దిబ్బిడిలో నీట మునిగి ఉన్న వరి పంట

రేపు సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈ.బోనంగి ఫార్మాసిటీ కాలనీలో కొండపై వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా నవంబర్ 2వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీస్వామివారికి భక్తి శ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బుగిడి రామ గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంలో స్వామివారి ఆలయ ప్రాంగణం వెలుగులతో కళకళలాడనుందని, భక్తులందరూ ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తాగునీటి పథకానికి కొత్త మోటారు ఏర్పాటు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జమాదులుపాలెం గ్రామంలో గురువారం రాత్రి రక్షత మంచి నీటి పథకం మోటార్ కాలిపోయింది. దీంతో గ్రామ సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి తాగునీరు ఇబ్బంది రాకుండా కొత్త మోటార్ వేశారు. ఈ కార్యక్రమంలో సానబోయిన శ్రీను, బొట్టా నాగ అప్పారావు, కరక పైడిరాజు, ఒమ్మి అప్పలరాజు పాల్గొన్నారు.

పంచాయతీ కేంద్రానికి రావాలంటే గెడ్డలో దిగాల్సిందే

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గుల్లేపల్లి శివారు కాలనీ ప్రజలు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని గుల్లేపల్లి గ్రామ శివారు లచ్చన్నపేట హిమగిరి, రామగిరి కాలనీలకు చెందిన ప్రజలు తమ పంచాయతీ కేంద్రం గుల్లేపల్లి రావాలంటే మొండిగెడ్డ దాటి రావాల్సిందే. ఆ కాలనీలలో సుమారుగా 130 కుటుంబాలకు చెందిన ప్రజలు స్థిర నివాసం ఏర్పరచుకొని జీవనం సాగిస్తున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా, నిత్యవసర వస్తువులు తెచ్చుకోవాలన్నా, ఏ పని కోసమైనా రావాలంటే గెడ్డ దాటి రావాల్సిందే. వర్షా కాలంలో గెడ్డ ఉధృతి సమయంలో ఈ కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా పడడంతో మొండిగెడ్డ ప్రతి నిత్యం ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో పాటుగా తమ గ్రామానికి సమీపాన కొండలు ఉండడం వలన ఏ చిన్న పాటి వర్షం కురిసినా అర్ధగంటలోనే గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంది. గెడ్డ ప్రవాహం కొన్ని గంటల వరకు తగ్గే పరిస్థితి ఉండదు. అప్పటి వరకు పంచాయతీ కేంద్రానికి వచ్చే పరిస్థితి ఉండటం లేదు. స్కూల్‌కి వెళ్లే పిల్లలు తిరిగి ఇంటికి వచ్చేవరకు వారి తల్లిదండ్రులు వారికోసం వేయి కళ్లతో వేచి చూడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ కాలనీలో ఏ ఒక్కరికైనా అనారోగ్య సమస్య సంభవించిన వెంటనే ఆసుపత్రి తీసుకెళ్లడానికి ఈ మొండిగెడ్డ వలన ఇబ్బంది కలుగుతుంది. ఈ విషయమై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించిన ప్రయోజనం లేదని ఆ కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం చేసి తమకు శాశ్వత పరిష్కార మార్గాన్ని కల్పించాలని వారు వేడుకుంటున్నారు.



గెడ్డలో దిగి గుల్లేపల్లి పంచాయతీ కేంద్రానికి వస్తున్న శివారు కాలనీ వాసులు



అప్పారావు దంపతులను సన్మానించిన పోలీసు అధికారులు

ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐ ఈతకోట అప్పారావును అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఘనంగా సత్కరించింది. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన్‌రావులు అప్పారావును శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. అప్పారావు, ఆయన సతీమణిని ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజా సేవతో కూడుకున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, లక్ష్మి, రమేష్, ఎల్.మన్మధరావు, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, సత్యనారాయణ, సిబ్బంది గిరి, అప్పలరాజు, పాల్గొన్నారు.

'బాహుబలి ది ఎపిక్' వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన బాహుబలి చిత్రం 2భాగాలను కలిపి బాహుబలి ది ఎపిక్ గా ప్రపంచ వ్యాప్తంగా విడుదల అయిన సందర్భంగా అనకాపల్లి సత్య నారాయణ థియేటర్లో శుక్రవారం అనకాపల్లి పట్టణ ప్రభాస్ ఫాన్స్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. విజయోత్సవ కేక్ ప్రభాస్ అభిమానుల కేరింతల నడుమ థియేటర్ అధినేత కొణతాల రామలింగ స్వామి కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. థియేటర్లో పనిచేసే స్టాఫ్‌కు స్వీట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షులు జీవీఎల్ఎన్ రాజు, ప్రతినిధులు ఆళ్ల ప్రవీణ్, కాండ్రేగుల జోగేంద్ర, పి.చందు, థియేటర్ మేనేజర్ బుద్ద శ్రీను, కొణతాల అరవింద్, కళ్యాణ్ కుమార్, సురేష్ పాల్గొన్నారు.

బయో రిసోర్స్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని చూచుకొండ గ్రామంలో విఘ్నేశ్వర బయో రిసోర్స్ సెంటర్ (బిఆర్‌సి)ను శుక్రవారం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డిపిఎం) లచ్చన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ పంటల వారీగా కావాల్సిన అన్ని రకాల ఇన్పుట్ ముందుగానే తయారుచేసి సెంటర్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. తుఫాన్ తర్వాత పంటలకు వచ్చే తెగుళ్ల నివారణకు జిల్లేడు కషాయం, దశపర్ని ఇంగువతో కలిపి స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. సేంద్రీయ పోటాష్ స్ప్రే చేయడం వల్ల పంట గరుకు ఏర్పడి పురుగుల ఆశించే అవకాశం ఉండదని, పొల్లు గింజలు రావని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్డి సూరి అప్పారావు ఎంపీటీసీ కిరణ్, మారిశెట్టి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని పరవాడపాలెం గ్రామంలో తాళ్ళపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మనీషా రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలిజి మంగ ముసిలినాయుడు, వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్‌పై వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-పరవాడ : విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా ఉక్కునగరంలోని పవర్ గ్రిడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో "విజిలెన్స్ మనందరి సంయుక్త బాధ్యత" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 25 మంది విద్యార్థినులు పాల్గొనగా, టి.కారుణ్య మొదటి బహుమతి, ఎన్.దీక్షిత రెండో బహుమతి, బి.పూజిత మూడో బహుమతి గెలుచుకున్నారు. అదనంగా జి.దీక్షిత ప్రియ, జి.దుర్గలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విజేతలకు పవర్ గ్రిడ్ సంస్థ చీఫ్ మేనేజర్ పి.రాజు స్వయంగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. విజిలెన్స్ భావన ప్రతి పౌరుడిలో ఉండాలి, అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజశ్రీ, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, కుమారి, పవర్ గ్రిడ్ సంస్థ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, పైల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన రోడ్లను వెంటనే పునర్నిర్మించాలి

ప్రజాశక్తి-పరవాడ : మండల కేంద్రం పరవాడ సినిమా హాల్ జంక్షన్లో శిథిలమైన రోడ్లను వెంటనే పునర్నిర్మించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ లంకెలపాలెం నుండి పరవాడ, ఉక్కు నగరం నుండి పరవాడ, పరవాడ నుండి అచ్యుతాపురం రోడ్లు శిథిలమై భారీ గోతుల్లో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు పడి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. హిందూజా బొగ్గు లారీలు అధికలోడ్‌లతో ఈ మార్గం నుండి ప్రయాణించడం వలన రోడ్లు శిథిలావస్థకు చేరుతున్నాయని పేర్కొన్నారు. వెంటనే ఆర్టీవో, పోలీస్ అధికారులు ఈ బొగ్గు లారీలపై కేసులు నమోదు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి రోడ్డ నిర్మించాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు పరవాడలో అట్టహాసంగా గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. తూతూ మంత్రంగా గుంతలు పూరచడం కాకుండా రోడ్ల నిర్మాణం పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో భారీ ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బొగ్గు లారీ యాజమాన్యాలపై కేసులు నమోదు చేయకపోతే ప్రజాసంఘాలుగా వాటిని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి అప్పారావు, గండి శ్రీనివాసరావు, బి అప్పలనాయుడు, సిహెచ్ వెంకనాయుడు, రెడ్డి సన్యాసిరావు పాల్గొన్నారు.



పరవాడ సినిమా హాల్ జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో చేస్తున్న కార్మికులు

విద్యార్థులకు వివిధ రకాల పోటీలు



విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

ప్రజాశక్తి-చోడవరం : నవంబర్ 26 రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు మండల స్థాయి వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. చోడవరం మండలంలో గల 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి పాఠశాల స్థాయిలో గెలుపొందిన ముగ్గురు చొప్పున 42 మంది పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ముగ్గురిని నియోజక వర్గ స్థాయి పోటీలకు ఎంపిక అవుతారని, నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన ఒక్కరికి అమరావతిలో గల అసెంబ్లీలో పాల్గొనవచ్చని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు గంగాధర్, రమేష్, సూర్యనారాయణ, కోటీశ్వరరావు అప్పారావు, ఉమా మహేశ్వరరావు, లక్ష్మి, మణిమాల, సత్యవతి తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.సింహాచలం, సిఆర్‌పిలు, సరోజినీ, భూలక్ష్మి, చంద్రికలు పాల్గొన్నారు.

సబ్బవరం : మండల స్థాయి రాజ్యాంగ దినోత్సవం పోటీలు సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, ఎం జె రవీంద్రబాబు ఆధ్వర్యాన జరిగాయి. మండలంలోని పాఠశాలలోని ఎనిమిది నుండి పదవ తరగతి విద్యార్థులకు పాఠశాల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, పోటీలో నిర్వహించారు. ఈ పోటీలలో వ్యాసరచన పోటీల్లో మల్లనాయుడుపాలెం జడ్పీ హైస్కూలు పి.హేమశ్రీ, వక్తృత్వం పోటీల్లో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కే స్వరూప, క్విజ్ పోటీలో ఏపీఎస్డబ్ల్యూఆర్ గురుకుల విద్యార్థి జే నిషాల్ నిలిచారని ఎంఈఓ తెలిపారు. ఈ విజేతల ముగ్గురు సబ్బవరం మండలం తరపున నియోజవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

హెటిరో బస్సుకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కోటవురట్ల : హెటిరో కంపెనీ బస్సుకు శుక్రవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. మండలం నుండి నక్కపల్లి వద్ద గల హెట్రో డ్రగ్స్ కంపెనీకి ఉద్యోగులను తీసుకువెళ్లే బస్సు తంగేడు గ్రామ వద్ద రోడ్డు పక్క భూములో దిగబడి ఒకపక్కకు ఒరిగిపోయింది. ఆ సమయంలో ఉద్యోగులు ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా హెట్రో బస్సులు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తూ ఉన్నాయని మండలంలో పలువురు ఆరోపిస్తున్నారు. మితిమీరిన వేగాన్ని నిలువరించేందుకు పోలీసులు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి

ప్రజాశక్తి-అనకాపల్లి : భారతదేశ ఏకైక మహిళ ప్రధాని ఇందిరాగాంధీ 41వ వర్ధంతిని శుక్రవారం స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలోని ఇందిరాగాంధీ విగ్రహానికి కళాశాల సూపరింటెండెంట్ పి.అనురాధ, విమెన్ ఎంపవర్మెంట్ కోఆర్డినేటర్ జె.సామ్రాజ్యం పూలమాలను వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు మాట్లాడుతూ గరీబీ హటావో అనే నినాదాన్ని ఇచ్చి పేదరికాన్ని నిర్మూలించడానికి ఆమె కృషి చేశారని తెలిపారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసి బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యాన్ని ఇప్పించిన ధీర వనిత ఇందిరా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, టీచింగ్ స్టాఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా సర్దార్ పటేల్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-విలేకర్ల యంత్రాంగం

భారత తొలి ఉపప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి కార్యక్రమం కలెక్టరు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి డిఆర్ఒ ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సర్దార్ పటేల్ చిత్ర పటానికి అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీసు అధికారులు పాల్గొన్నారు. స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. డైట్ కళాశాలలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. సబ్బవరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అందరూ ఐక్యతతో మెలగాలని నక్కపల్లి ఎస్ఐ సన్నిబాబు, ట్రైనీ ఎస్ఐ సాహిబా అంజుమ్ అన్నారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంచార్జ్ ప్రిన్సిపాల్ జి జయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు. రావికమతం మండలం కొత్తకోట సిఐ కోటేశ్వరరావు పటేల్ జయంతి ని పురస్కరించుకొని పలువురు తో ఆయన వాకింగ్ చేసారు. ఎస్సైలు శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.



నక్కపల్లి : మాట్లాడుతున్న ఎస్ఐ సన్నిబాబు

విశాఖ స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్, క్రీడా విభాగం ఆధ్వర్యంలో, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్, యూనిటీ రన్ నిర్వహించారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) అరుణ్ కాంతి బాగ్చి ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు. సీతమ్మధారలోని ఎపిఇపిడిసిఎల్.కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి సంస్థ డైరెక్టర్లు డి చంద్రం, టి వనజ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె వి రామకృష్ణ ప్రసాద్, చీఫ్ జనరల్ మేనేజర్లు డి సుమన్ కల్యాణి, బి అశోక్ కుమార్, ఎల్ మహేంద్రనాద్, ఎల్ దైవప్రసాద్, ఎస్ విజయ్ ప్రతాప్ నివాళులర్పించారు. పెందుర్తి సిఐ కెవి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, విశాఖ డిఫెన్స్ కాలేజీ విద్యార్థులతో చిన్నముషిడివాడ జంక్షన్ నుండి పెందుర్తి వరకు ఏక్తా దివస్ రన్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. భీమునిపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తగరపువలస అనిట్స్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాజ్యలక్ష్మి, అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఐక్యతా దినోత్సవం ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపల్స్ డాక్టర్ పి సురేఖ, పి.శ్రీవాణి, అధ్యాపకులు బి. సీతన్నాయుడు బి .నాగరాజు డాక్టర్ సీతారత్న,డాక్టర్ బి. స్వర్ణలత పాల్గొన్నారు. తగరపువలస బిజెపి మండల అధ్యక్షులు చిల్ల త్రినాధ్ రెడ్డి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆనందపురం మండలం పందలపాకలో ఐటిబిపి వద్ద 56వ బెటాలియన్ కమాండెంట్ హరిసింగ్ ఆధ్వర్యంలో ఐక్యతా ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ కమాండెంట్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బంక శ్రీను, ఎంపిటిసి వి. అప్పలనాయుడు, పి. రాంబాబు, యమ్. నారాయణరావు, యమ్. సురేష్ పాల్గొన్నారు. గుడిలోవ ఏక్యూజే కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ. పవన్ కుమార్ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన పాలవలసలో ఐక్యతా ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. .మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పటేల్‌కు నివాళులర్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

తుపాను బాధితులకు సరుకుల పంపిణీ



మాడుగులలో సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో పలు మత్స్యకార గ్రామాల్లో శుక్రవారం మత్స్యకారులకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను అధికారులు, నాయకులు అందజేశారు. మండల ప్రత్యేక అధికారి విజయ, తహసిల్దార్ నరసింహమూర్తి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు నాయకులు చేతులమీదుగా సరుకులు అందచేసారు. మండలంలో మత్స్యకార గ్రామాలైన రాజయ్యపేట, బోయపాడు పెద తీనార్ల, చిన తీనార్ల, దొండవాక గ్రామాల్లో మొంథా తుఫాన్ కారణంగా ఒక్కొక్క మత్స్యకార కుటుంబానికి 50 కేజీలు బియ్యం, కిలో పంచదార, లీటర్ ఆయిల్, కిలో కందిపప్పు, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు పంపిణీ చేశామని తహసిల్దార్ తెలిపారు. రాజయ్యపేటలో జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, సర్పంచ్ పిక్కి అప్పలనర్స, ఎంపిటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, నాయకులు గంగరాజు, కోదండరావు, పెదతీనార్ల, దొండవాక గ్రామాల్లో ఎంపిటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, నాయకులు తాతారావు పాల్గొన్నారు.

పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే బండారు....

మాడుగుల:మొందా తుఫాన్ బాధితులకు ప్రభుత్వం సరుకులు పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో ఢీ.గొట్టివాడ గ్రామంలో తహసిల్దార్ రమాదేవితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో 28 కుటుంబాలు పునరావాస కేంద్రాలలో ఉన్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి 3వేల చొప్పున ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా సేవలు అందించిన ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులను కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాజారామ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ, జనసేన మండల అధ్యక్ష, కార్యదర్శులు నందారపు సన్యాసరావు, పుప్పాల రమేష్, గట్టెడ్డి శివాజీ దాసరి అచ్యుతరావు, ఎంపీటీసీ శ్రీనాథ్ జగ్గారావు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరంలోని మొంథా తుపాన్ బాధితులకు రెండో నెంబర్ రేషన్ డిపో వద్ద శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తుఫానుతో బాలయ్య కోనేరు ప్రాంతం నీట మునగగా, పలు కుటుంబాలు పునరావాస కేంద్రంలో మూడు రోజులపాటు ఉన్నారు. వారందరికీ సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం క్రమంలో టిడిపి నాయకులు గూనూరు మల్లు నాయుడు, మండల ప్రత్యేక అధికారి శ్రీదేవి, ఎంపీడీవో ఆంజనేయులు, తహశీల్దారు ఎ.రామారావు, పంచాయతీ ఈవో కె.శ్రీనివాసరావు సర్పంచ్ బండి నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట మండలం నర్సింగబిల్లి గ్రామంలో తుపాన్ బాధితులు 30 కుటుంబాలకు ఎంపీ సిఎం.రమేష్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ సరుకులు అందజేశారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, పరమేశ్వరరావు, ఉగ్గిని రమణమూర్తి, పొన్నగంటి అప్పారావు కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని తుపాన్ బాధితులు గొర్లివానిపాలెం, గుల్లేపల్లి, మల్లు నాయుడుపాలెం, రాయపురఅగ్రహారం, టెక్కలి పాలెంలో సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, సిఐ జి.రామచంద్రరావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, జనసేన నాయకుడు పిల్లల అప్పల నాయుడు, సర్పంచ్‌లు డి.ప్రసాదరావు, బండారు మంగ శ్రీను, రాము నాయుడు, ఎంపీటీసీ చైతన్య పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : పట్టణంలో కాకివాని వీధిలో తుపాన్ బాధితులు 45 మందికి రేషన్ డిపో ద్వారా నిత్యవసర సరుకులను మున్సిపల్ చైర్మన్ పిల్లా రామకుమారి పంపిణీ చేశారు. డిటి వినయకుమార్, కూటమి నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, ఎం.గోపినాథ్, కే.నరేష్, శ్రీను, అందే రమణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని గరిసింగి గ్రామంలో తుఫాను బాధిత కుటుంబాలకు మాడుగుల శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి చేతుల



సబ్బవరంలో ...

మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, సర్పంచ్ గూడెపు రాము, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పోతల పాత్రునాయుడు, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని బంగారమ్మపాలెంలో నిత్యవసర వస్తువులను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పంపిణీ చేశారు. గ్రామంలో సముద్ర ప్రమాదంలో భర్త మృతి చెందిన మైలిపల్లి సత్తియ్యమ్మకు సొంత నిధులతో ఆర్థిక సహాయం అందజేశారు. బాధితులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు అమలకంటి అబద్ధం, వినోద్ రాజు, నల్లపరాజు వెంకటపతి రాజు, గుర్రం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 96 వ వార్డు పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రం సమావేశ మందిరంలో మొంథా తుపాన్ బాధితులకు ప్రభుత్వపరంగా నిత్యావసరాల కిట్‌లను ఎంపీ సీఎం రమేష్, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు ఎపి ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి పంపిణీ చేశారు. తహశీల్దార్ వెంకట అప్పారావు, జోనల్ కమిషనర్ శంకరరావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, పెందుర్తి పిఎసిఎస్ చైర్మన్ ఐతి సింహాచలం, ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మడక పార్వతి, ఎఎంసి వైస్ చైర్మన్ గోరపిల్లి సోము నాయుడు, డైరెక్టర్ ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో నిత్యవసరాలు, ఆర్థికసాయాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు పంపిణీ చేశారు. టిడిపి కార్పొరేటర్లు, రెవిన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

బాలల వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం: బాలల దినోత్సవ వేడుకలు నర్సీపట్నం డివిజన్ కేంద్రంలో పి ఆర్ టి యు జిల్లా నాయకులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డీజే నాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ, పిల్లల హక్కులు, ఆరోగ్యం, విద్య వంటి అవసరాలను గుర్తించాలన్నారు. విద్యార్థులకు సద్గుణాలతో పాటు విలువలు నేర్పుతూ వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల బాధ్యత అని అన్నారు, పిఆర్టియు జిల్లా నాయకులు డీజే నాథ్ మాట్లాడుతూ, ప్రతినిత్యం బాలలతో గడిపితే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 1న దేశభక్తి గీతాలు పోటీలు, 3,4,న పద్య పఠనం వకృత్వం, 6న వ్యాసరచన, క్విజ్,7, 8న ప్రత్యేక ఆకర్షణ, 13న విచిత్ర వేషధారణ, 14న సిటీ క్లబ్ ఆవరణంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు సంఘ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న నాయకులు

ఆలయానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు గ్రామంలో మోదమాంబ అమ్మవారికి అదే గ్రామానికి చెందిన పాత్రుని రామారావు అచ్చియమ్మ దంపతులు ఆలయ ఆలయ అభివృద్ధికి నిమిత్తం 10 వేలు నగదును శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన రవణబాబు, వానపల్లి వేణు, పోతిన జగదీష్, వడ్డాది గణేష్, ఈశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నగదు ఇస్తున్న దాత



అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు

గ్రామాల్లో పశువైద్య సేవలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పశు వైద్యులు సంచార పశు వైద్యశాల సహాయంతో గుండుపాల, చీడిగుమ్మల, పాకలపాడు గ్రామాల్లో పశువులకు వైద్య సేవలు అందించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని చెప్పారు. బ్లీచింగ్ పౌడర్ పాకల చుట్టూ చల్లుకోవాలని, పశువులకు పరిశుభ్రమైన నీటిని నిత్యం అందుబాటులో ఉంచాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యులు దుర్గాప్రసాద్, సురేష్, శిరీష, సంచార పశు వైద్యురాలు హరిత పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి -మాడుగుల:ఏపీ ఆర్యవైశ్య ఐవీఎస్ ఇంటర్నేషనల్ వైశ్య పేరడేసన్ అనకాపల్లి జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షులు శ్రీనాథ్ శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాడుగుల రావిచెట్టు జంక్షన్ వద్ద ఉన్న మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు,పెన్సిల్స్ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి, వనిత క్లబ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వరి పంటల్లో తెగుళ్లపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం మత్సవానిపాలెం గ్రామంలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరి పంటలలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం రాజ్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం పొలంలో నీరు ఎక్కువగా ఉంటే దానిని త్వరగా బయటకు పోయేలా చూసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధిలు తిరుమలరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని వరి పంటలను మండల వ్యవసాయాధికారి చిరంజీవి శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆకుముడత, అగ్గి తెగులు మండలంలో అన్ని గ్రామాల్లో ఉధృతి ఎక్కువగా ఉందని గుర్తించారు. అగ్గి తెగులుకు ట్రైసైక్లోజోన్ 120 గ్రాములు, ఆకుముడత కార్బఫ్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు 200 లీటరు నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలని చెప్పారు. చిరుపొట్ట దశలో తప్పనిసరిగా ఎకరానికి 20–30 కేజీల యూరియా, 20–25 కేజీల పొటాష్ పైపాటుగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట విఎఎ ఎన్.రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.



గణేష్‌ను సత్కరిస్తున్న నాయకులు

వైసిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్

ప్రజాశక్తి-నర్సీపట్నం:మాకవరపాలెం మండలం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా పోలిరెడ్డి లక్ష్మణ్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం మాజీ శాసనసభ్యులు ఉమా శంకర్ గణేష్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన బాధ్యతల పట్ల క్రమశిక్షణతో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు అనంతరం ఉమాశంకర్ గణేష్ ను పలువురు వైసిపి నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, పెట్ల భద్రాచలం, పిల్లా శ్రీను, లాలం వరహాల బాబు పాల్గొన్నారు.

'దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి'

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో రాజయ్య పేటలో పంచాయతీ కార్యదర్శి సత్యం, సచివాలయ సిబ్బందిని నిర్బంధించిపై దురుసుగా ప్రవర్తించిన వారిని అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సిఐ మురళి, ఎస్ఐ సన్నిబాబులకు వినతిపత్రం అందజేసారు. బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు వారిపై చట్టపరమైన చర్యలు లేకపోవడం, అరెస్టు చేయలేదన్నారు.అనంతరం రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు.వినతిపత్రం అందజేసిన వారిలో వేంపాడు ఎంపీటీసీ, భీమ్ సేన వార్ కార్యవర్గ సభ్యులు కుంచే మధు, రాష్ట్ర నాటకరంగ డైరెక్టర్ పల్లా విలియం ఖేరి, గోరింట ఆశ, సీకొలు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పాత మల్లంపేట గ్రామంలో ఇటీవల మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వీధి దీపాలు మరమ్మత్తులకు గురయ్యాయి. దీంతో స్థానికుల అభ్యర్ధన మేరకు సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మీ శుక్రవారం విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో యువకుల సహకారంతో ఈ పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా స్థానికులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బల్క్ డ్రగ్‌తో మత్స్యకారుల ఉనికికి దెబ్బ

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారుల ఉపాధిని, ఉనికిని దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయొద్దని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు తెలిపారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారుల తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శుక్రవారం నాటికి 48 వ రోజుకు చేరుకుంది. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బల్క్‌డ్రగ్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల జీవన ఉపాధి పోతుందన్నారు. చేపల వేట తప్ప, మరో వృత్తి మత్స్యకారులకు తెలియదని, సముద్రానికి దూరం చేయొద్దన్నారు. మత్స్యకారులకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటంలో పాల్గొంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, నాయకులు


వినతి పత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

అందరికీ సరుకులు ఇవ్వాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులతో పాటు, మిగిలిన జాదితులకు కూడా బియ్యంతో పాటు, సరుకులు అందజేయాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ కోరారు. మండలంలో అమలాపురం గ్రామానికి చెందిన వారితోపాటు, పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం తహసిల్దార్ నరసింహమూర్తికి వినతి పత్రం అందజేసారు. మత్స్యకార గ్రామాల్లో మత్స్యకారులతో పాటు, శెట్టిబలిజ, ఇతర కులాలు వారు కూడా నివాసం ఉంటున్నారని మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా అందరూ ఇబ్బందులు పడ్డారన్నారు.మత్స్యకారులకు బియ్యంతో పాటు, నిత్యవసర సరుకులను మిగిలిన వారికి కూడా అందజేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు, వైసీపీ నాయకులు సూరకాసుల గోవింద్, వి కృష్ణ, తళ్ళ భార్గవ్, కొప్పిశెట్టి హరిబాబు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న రెల్లి కాలనీవాసులు

శిథిల భవనాలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలోని రెల్లి కాలనీలో ఎస్సీ, బీసీ వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయని వాటిని తొలగించాలని రెల్లి కాలనీవాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో డి సీతారామరాజుకు వినతిపత్రం అందజేసి, సమస్యను విన్నవించారు. గత కొన్నేళ్ళ నుంచి ఎస్సీ, బీసీ వసతి గృహ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా ఉన్నాయన్నారు. పక్కనే అంగన్వాడి కేంద్రం తో పాటు, కాలనీలో పలువురు నివాసం ఉంటున్నామన్నారు. శిథిల భవనాల్లో విష సర్పాలు సంచరిస్తున్నాయని, వాటికి ఆసరాగా శిథిల భవనాలు ఉన్నాయని పక్కనే చిన్న పిల్లలు, కాలనీవాసులు ఉంటున్నందున తీవ్ర భయాందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే శిథిల భవనాలు తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.


చెక్కును అందజేస్తున్న హోం మంత్రి అనిత

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి:సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని, పేద కుటుంబాలు వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసిన బాధితులకు వెంటనే సాయం మంజూరు అవుతుందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లిలో హోం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద శుక్రవారం బాధితులకు ఆమె చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించలేదు.. కేసులు ఉపసంహరించాలి

- డిటికి మత్స్యకారుల వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో రాజయ్యపేట పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించలేదని, కేసులు ఉపసంహరించాలని మత్స్యకారులు కోరారు. శుక్రవారం డిటి నారాయణరావుకు వినతిపత్రం అందజేశారు. రాజయ్యపేటలో తుఫాన్ షెల్టర్లో బాధితులకు భోజన ఏర్పాట్లు చేశారని, మాజీ ఎంపీటీసీ సభ్యులు పిక్కి తాతీలుతో పాటు పలువురు మత్స్యకారులు సచివాలయానికి వెళ్లి వరద బాధితులకు భోజనం పెడుతున్నట్లు దండోరా వేయలేదని, అందరికీ భోజనం పెట్టలేదని అడగామే తప్ప, వారిపై దురుసుగా ప్రవర్తించడం, కొట్టడం కానీ చేయలేదని, తమపై పెట్టిన కేసులు ఉపసంహరించాలని కోరారు.వినతి పత్రం అందజేసిన వారిలో మత్స్యకారులు పిక్కి తాతియ్య, మైలపల్లి మహేష్ బాబు, చేపల సోమేశ్వరరావు, బి బాబ్జి, పి.నల్ల ఉన్నారు.

లక్ష్మణరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-రావికమతం:అంకిత భావంతో పనిచేసిన ప్రతి ఉద్యోగికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా జడ్పిటిసిల ఫోరం అధ్యక్షులు దొండ రాంబాబులు తెలిపారు. మట్టవానిపాలెం సోషల్ స్కూల్ అసిస్టెంట్ రొంగలి లక్ష్మణరావు శుక్రవారం ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ చేశారు. మండల కేంద్రం సిద్ధార్థ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ కార్యక్రమానికి చోడవరం, మాడుగుల శాసనసభ్యులతో పాటు, మాడుగుల మాజీ శాసనసభ్యులు రామానాయుడు, పూర్వపు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిసిఎంఎస్ చైర్మన్ ముక్కా మహాలక్ష్మీ నాయుడు, స్థానిక సర్పంచ్ మోదినాయుడు, స్థానిక ఎంపీటీసీ వేపాడ లక్ష్మి నాగేశ్వరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మై చర్ల నాయుడు, విద్యాశాఖ అధికారి లింగమూర్తి, బ్రహ్మాజీలు లక్ష్మణరావు దంపతులను ఘనంగా సన్మానించారు.


సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

స్పీకర్ అయ్యన్న స్పందించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం: మాకవరపాలెం మండల టిడిపి అధ్యక్షులు రుత్తల ఎర్రపాత్రుడు కూటమి నాయకులను విస్మరిస్తున్న అంశంపై స్పీకర్ అయ్యన్న స్పందించాలని బిజెపి నాయకులు, పిసిఎస్ డైరెక్టర్ అడిగర్ల రాంబాబు, నేతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ, మండలంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ అంశాలపై కూటమి నాయకులను కలుపుకోకుండా ఇష్టారాజ్యంగా ఏకపక్ష ధోరణిలో వ్యవహరిస్తున్నారని తెలిపారు. మండలంలో పలు ప్రభుత్వ భూములు వివిధ కంపెనీలకు సేకరణ, కూటమి పార్టీ అభివృద్ధి సమావేశాలకు నాయకులను కూడా కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు శరం రెడ్డి సత్యనారాయణ, మండల అధ్యక్షులు మర్రి నాయుడు, ఉపాధ్యక్షులు రుత్తల జమీలు, పిల్లా బాబూరావు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

-బ్లీచింగ్ చల్లించిన సర్పంచ్

ప్రజాశక్తి-గొలుగొండ:తుఫాన్ ప్రభావంతో గ్రామంలో మురికినీరు నిల్వ ఉండి, వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా నాగాపురం పంచాయతీ సర్పంచ్ యలమంచిలి రఘురామ చంద్రరావు స్వయంగా పంచాయతీ సిబ్బందితో కలిసి గ్రామంలో బ్లీచింగ్ చల్లించారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రతీ వీధి, డ్రైనేజ్ వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో స్వచ్ఛమైన పంచాయతీగా నాగాపురాన్ని నిలబెట్టడమే తన లక్ష్యమని సర్పంచ్ రఘురామ చంద్రరావు చెప్పారు.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

సిపిఎం మండల నాయకులు బ్రహ్మాజీ


నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నేత బ్రహ్మాజీ

ప్రజాశక్తి-మునగపాక : మొంథా తుపాన్ కారణంగా పంటలు నీట మునిగి, పశువులకు పశు గ్రాసం లేక తీవ్రంగా నష్టపోయిన రైతులు, పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల నాయకులు ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. స్థానిక జగ్గప్ప గారి ఇస్సవ, జగనన్న కాలనీ, యాత పేట, ఎస్సీ కాలనీలో ముంపు ప్రాంతాలను శుక్రవారం బ్రహ్మాజీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను కారణంగా వ్యవసాయ కూలీలతో పాటుగా, రైతులు అపారంగా నష్టపోయారని, వరి నీట మునిగి కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా పొలాల్లో గడ్డి కుళ్ళి పశువులకు దాణా లేక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పాడి రైతులకు పశుగ్రాసం పంపిణీ చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే ముంపు ప్రాంతాలను పరిశీలించి తీవ్రంగా నష్టపోయిన చెరకు రైతులకు ఎకరాకు రూ.50 వేలు, వరికి ఎకరాకు రూ.25 వేలు చొప్పున పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. వరద బాధితులకు తక్షణ సాయం కింద 50 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులతోపాటు ఆర్థిక సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, సిపిఎం నాయకులు పెంటకోట సత్యనారాయణ, టెక్కలి జగ్గారావు, టెక్కలి దేవకి, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి- పరవాడ : ఉమ్మడి జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్లో జరిగిన జిల్లాస్థాయి సబ్ - జూనియర్ ఆర్చరీ పోటీలు శుక్రవారం ముగిశాయి. జిల్లా నలుమూలల నుండి సుమారు 60 మంది క్రీడాకారులు హాజరై ఈ పోటీలలో పాల్గొన్నారు. వీరిలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు శనివారం నుండి విజయవాడలో జరుగు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని జిల్లా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి విశాఖ జిల్లా బాల బాలికలు కె.సాయి మనస్వి, పి.హర్షిత, ఎన్.మోక్షిత, తాస్వి, కీర్తి మెదప్రియ, వి.కీర్తిక. వి.ఆద్య, కె.ఆశ్రిత్ సాయికృష్ణ, డి.గౌతమ్. వి.లలిత్ సాయి, పూర్వ్ రాథోడ్, ప్రసాద్ నాయుడు, మోహిత్ సాయి, ఎం.మనోజ్ కుమార్, సంతోష్ పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు జిల్లా ఆర్చరీ సంఘం ఉప అధ్యక్షులు సత్యనారాయణ అభినందించారు.


ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ధర్మవరం గ్రామస్తులను తుపాన్ బాధితులుగా గుర్తించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : వరహానది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ధర్మవరం గ్రామ ప్రజలను కూడా తుపాన్ బాధితులుగా గుర్తించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయత ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బియ్యం, నిత్యావసర వస్తువులు ధర్మవరం అగ్రహారం గ్రామంలో కూడా ఇవ్వాలని కలెక్టర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. ధర్మవరం అగ్రహారం గ్రామంలో అందరూ వ్యవసాయ కూలీలు, పేదలే ఉన్నారని, గత నాలుగు రోజులుగా ఎటువంటి పనులకు వెళ్లడానికి వీలు లేక, తినడానికి కూడా బియ్యం, నిత్యావసర వస్తువులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే ధర్మవరం అగ్రహారం గ్రామ ప్రజలకు ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి ఆదుకోవాలని కోరారు.